సాక్షి
బాపట్ల
బుధవారం । 30 । ఏప్రిల్ । 2025



ఘనంగా బాలయేసు చర్చి తిరునాళ్ల

నాదెండ్ల: కనపర్రులోని బాలయేసు పుణ్యక్షేత్ర తిరునాళ్ల మంగళవారం వైభవంగా జరిగింది. ఫాదర్ జోజయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



కార్యసిద్ధి ఆంజనేయుడికి పూజ

సత్తెనపల్లి: నాగన్న కుంటలో వేంచేసి ఉన్న శ్రీ కార్యసిద్ధి ఆంజనేయస్వామి దేవాలయ 11వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.


ఆంజనేయుడికి నాగవల్లీదళార్చన



ఫిరంగిపురం: దక్షిణాముఖ ఆంజనేయ స్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. స్వామికి పంచామృతాలతో అభిషేకాలు చేసి నాగవల్లీదళాలతో అష్టోత్తర, సహస్రనామ పూజలు చేశారు.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ బాపట్ల పార్లమెంట్ పరిశీలకుడిగా తూమాటి



సాక్షి ప్రతినిధి, బాపట్ల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడిగా ఆపార్టీ ఎమ్మెల్సీ తూమాటి మాధవరావును నియమించారు. పార్టీ అధినేత వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. కందుకూరు నియోజకవర్గానికి చెందిన తూమాటి మాధవరావు వైఎస్సార్ సీపీ కీలక నేతగా ఉన్నారు. పార్టీ అధినేత వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆయనను ఎమ్మెల్సీగా ఎంపిక చేశారు. తాజాగా తూమాటికి పార్టీ బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గ బాధ్యతలు అప్పగించారు. తూమాటిని పరిశీలకుడిగా నియమించడం పట్ల పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి.

దద్దనాల మిట్ట ఆంజనేయస్వామి తిరునాళ్ల



రొంపిచర్ల: మండలంలోని వీరవట్నం సమీపంలో గల దద్దనాల మిట్ట ఆంజనేయస్వామి దేవాలయ వార్షికోత్సవ తిరునాళ్ల మంగళవారం నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల వారు అధిక సంఖ్యలో దేవాలయానికి వచ్చి పొంగళ్లు నిర్వహించి స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. స్వామికి ఇష్టమైన పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

వీర్ల అంకమ్మతల్లికి బోనాలు



దాచేపల్లి: వీర్ల అంకమ్మతల్లి కొలుపుల తిరునాళ్ల సందర్భంగా మంగళవారం భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలో ఉన్న మహిళలు దేవాలయానికి బోనాలతో వచ్చారు. నెత్తిపై బోనాలు పెట్టుకుని మేళతాళాలతో గ్రామ పుర వీధుల్లో నుంచి దేవాలయానికి చేరుకుని చుట్టూ ప్రదక్షిణ చేశారు. ప్రత్యేకంగా పూజలు చేసిన తరువాత అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యుడు యలమల నరేష్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నేడు పాలిసెట్

- గుంటూరు నగరంలో 11 పరీక్ష కేంద్రాలు
- హాజరు కానున్న 4,030 మంది విద్యార్థులు
- నిముషం ఆలస్యంగా వచ్చినా నో... ఎంట్రీ

గుంటూరు ఎడ్యుకేషన్ : పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికై ఉద్దేశించిన పాలిసెట్-2025 బుధవారం జరగనుంది. జిల్లా వ్యాప్తంగా దరఖాస్తు చేసిన 4,030 మంది విద్యార్థులకు గుంటూరు నగరంలో 11 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరగనుండగా, విద్యార్థులు కనీసం గంట ముందుగా కేంద్రాలకు చేరుకోవాలి. ఉదయం 11 గంటల తరువాత నిముషం ఆలస్యమైనా విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతించబోమని పాలిసెట్-2025 సమన్వయకర్త, నల్లపాడు ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ టి. శేఖర్ తెలిపారు.

నేడు దుర్గమ్మ సన్నిధిలో శ్రీమహాలక్ష్మి యాగం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): అక్షయ తృతీయను పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో బుధవారం శ్రీమహాలక్ష్మి యాగాన్ని నిర్వహించనున్నారు. ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి ఆలయం సమీపంలోని యాగశాలలో ఉదయం 9 గంటలకు యాగం నిర్వహించేందుకు వైదిక కమిటీ నిర్ణయించింది. యాగాన్ని దేవస్థానం తరపున ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. మే 2వ తేదీన ఆది శంకరాచార్యుల జయంతి వేడుకలను నిర్వహించనున్నారు. వైశాఖ శుద్ధ పంచమి శుక్రవారం ఉదయం 8 గంటలకు నూతన పూజా మంటపంలో జగద్గురు ఆది శంకరాచార్యుల విగ్రహానికి పంచామృత అభిషేకాలు, అర్చన నిర్వహిస్తారు. సాయంత్రం 5 గంటలకు ఆది శంకరాచార్యులకు నగరోత్సవ సేవ నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు. మల్లికార్జున మహా మండపం నుంచి ప్రారంభమయ్యే నగరోత్సవం అర్జున వీధి, రథం సెంటర్, కెనాల్‌రోడ్డు, వినాయకుడి గుడి మీదుగా ఘాట్‌రోడ్డు, అమ్మవారి ఆలయానికి చేరుకుంటుంది.

ధాన్యం తీసుకున్నారు..

ముఖం చాటేశారు

- ఏప్రిల్ 1న కొత్తగొల్లపాలెంలో పింఛన్ల పంపిణీలో పాల్గొన్న చంద్రబాబు
- మార్చి 28న మూడు వేల బస్తాల ధాన్యం తరలింపు
- నెల రోజులు దాటినా రైతుల ఖాతాలకు డబ్బు జమచేయని ప్రభుత్వం
- ఏఓని అడిగితే కలెక్టర్ వద్ద ఫైల్ ఉందంటూ దాటవేత
- ప్రొక్యూర్‌మెంట్ వారు లంచం డిమాండ్
- ఆందోళన చెందుతున్న కొత్తగొల్లపాలెం రైతులు



గోడు వెళ్ల బోసుకున్న కొత్తగొల్లపాలెం గ్రామ రైతులు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: మద్దతు ధర ఇస్తాం.. వారం రోజుల్లోపే డబ్బులు వేస్తాం.. నిశ్చింతగా ఉండాలంటూ స్వయంగా జిల్లా కలెక్టర్, జిల్లా అధికారులు భరోసా ఇచ్చారు. . ధాన్యం మిల్లులకు చేరడంతో డబ్బులు పడతాయని ఆశ పడ్డారు. నెల దాటుతున్నా రైతుల ఖాతాల్లో పైసా జమకాలేదు. ఏం చేయాలో అర్థంకాక కొత్తగొల్లపాలెం రైతులు లబోదిబోమంటున్నారు.

చంద్రబాబు రాకతో హడావుడి

ఆవులదొడ్డి కొత్తగొల్లపాలెం గ్రామంలో 110 కుటుంబాలు జీవిస్తున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో 1500 ఎకరాల్లో వరి సాగుచేయగా ఎకరాకు 30 నుంచి 35 బస్తాల చొప్పున 45 వేల బస్తాల ధాన్యం దిగుబడి వచ్చింది. రబీలో దాదాపు 2 వేల ఎకరాల్లో వరి సాగు చేయగా సుమారు 60 వేల బస్తాల ధాన్యం దిగుబడి వచ్చింది. చినగంజాం మండలం కొత్త గొల్లపాలెం గ్రామంలో ఏప్రిల్ 1న జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరయ్యారు. అప్పటికే హార్వెస్టింగ్ పూర్తి చేసుకున్న గ్రామానికి చెందిన రైతులు కల్లాల్లో ధాన్యం ఆరబెట్టుకున్నారు. ఇళ్లలో వసతి లేక కొందరు రైతులు ఆరిన ధాన్యాన్ని చంద్రబాబు సభ జరగాల్సిన ప్రాంతంలోనే నిల్వ ఉంచారు. ధాన్యాన్ని మద్దతు ధరకు కొనలేదని రైతులు ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేస్తే.. అసలుకే మోసం వస్తుందని భయపడ్డ పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, కలెక్టర్ వెంకట మురళి, అప్పటి జేసీ ప్రఖర్‌జైన్, పౌరసరఫరాల అధికారి విలియమ్స్‌లు ధాన్యాన్ని ఇళ్లల్లో దాచుకోవాలని రైతులకు సూచించారు. వసతి లేదని రైతులు నిరాకరించారు. హుటాహుటిన 60 మంది రైతులకు చెందిన 3 వేల బస్తాల ధాన్యాన్ని తూకాలు వేయించి ట్రాక్టర్ల ద్వారా చీరాల, వేటపాలెం, ఈపురుపాలెం పరిధిలోని రాధాకృష్ణ, చెక్కబాబు, మారుతీ ట్రేడర్స్, బాలాజీ, వసంతలక్ష్మి, సుబ్రమణ్యం ట్రేడర్స్, సత్యనారాయణ తదితర రైస్‌మిల్లులకు తరలించారు.

ఇబ్బందులు తొలగాయని భావించారు

నిబంధనల మేరకు రైతులు ధాన్యాన్ని అమ్మాలంటే వ్యవసాయ సహాయకులు ఇచ్చే ఈ క్రాప్ వివరాలతోపాటు షెడ్యూలింగ్, డేటా ఎంట్రీ, ఆర్ఎస్‌కె ఇచ్చే ట్రాక్ షీట్, జీపీఎస్ వెహికల్, ఫండ్ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్, మిల్లు నుంచి ఎక్నాలెడ్జిమెంట్‌లు అవసరం. ఇవన్నీ లేకుండా ధాన్యం కొనడం, డబ్బులు ఖాతాల్లో వేయడం జరగదు. ఈ విషయం కొంత మంది రైతులకు తెలిసినా జిల్లా స్థాయి అధికారులు వచ్చి ధాన్యం స్వయంగా తీసుకెళ్లడంతో డబ్బులిస్తారని నమ్మారు. అధికారులు మాత్రం ఏరుదాటాక బోడిమల్లన్న చందంగా వ్యవహరించారు. కలెక్టర్ దగ్గర ఫైల్ ఉందని, ఓకే అయితే డబ్బులిస్తారట అని మండల వ్యవసాయాధికారి చెప్పగా, ఒక్కొక్క రైతు రూ.రెండు వేలు ఇస్తే అధికారులతో మాట్లాడి డబ్బులు వేయిస్తానని స్థానిక సొసైటీ ప్రొక్యూర్‌మెంట్ ఉద్యోగి డిమాండ్ చేస్తున్నాడు. మిల్లర్లను అడిగితే పౌరసరఫరాలశాఖ అధికారులతో మాట్లాడుకొని డబ్బులు కొట్టించుకోమంటున్నారని పలువురు రైతులు 'సాక్షి' వద్ద వాపోయారు. ఎవరిని కలవాలో తెలియడం లేదని ఆవేదన చెందారు. అసలు డబ్బులు వస్తాయో రావోనని ఆందోళన పడుతున్నారు. మిల్లర్లు క్వింటాకు 5 నుంచి 12 కిలోల ధాన్యం కోత పెట్టి మోసగించారని ఆరోపించారు.

ఎండీ అనుమతిస్తే డబ్బులు

ముఖ్యమంత్రి వస్తుండడంతో కొత్తగొల్లపాలెం రైతుల ధాన్యాన్ని నిబంధనల ప్రకారం కాకుండా హుటాహుటిన మిల్లులకు తరలించాల్సి వచ్చింది. సాంకేతిక సమస్యలు తలెత్తడంతో రైతులకు డబ్బులు వేయడం ఇబ్బందిగా మారింది. స్టేట్ సివిల్ సప్లై ఎండీ అనుమతితో మాత్రమే రైతులకు డబ్బులు చెల్లించే అవకాశముంది. ఇందుకోసం అప్పటి జేసీ ఎండీకి ఫైల్ పంపారు. త్వరలోనే రైతు ఖాతాల్లో డబ్బులు పడతాయి.

– విలియమ్స్,
మాజీ ఇన్‌చార్జి డీఎం,
సివిల్ సప్లయి



ఆరబోసిన ధాన్యం

నమ్మించి మోసగించారు



పదెకరాల్లో వరిసాగు చేశాను. ముఖ్యమంత్రి వచ్చే ముందు వరకు కల్లాల్లోనే ధాన్యం ఉన్నాయి. అధికారులు వచ్చి ధాన్యం మిల్లులకు తరలిస్తామన్నారు. ట్రాక్టర్ బాడుగలు, కాటా కూలి మా చేతే పెట్టించారు. 200 బస్తాల ధాన్యం ఈపురిపాలెం చెక్కా బాబు మిల్లుకు తోలాం. తేమశాతం లేకపోయినా క్వింటాకు 12 కిలోలు కోత పెట్టారు. ప్రభుత్వం ఒక్క రూపాయి ఇవ్వలేదు. అన్ని విధాలా నష్టపోయాం.

– వడ్లమూడి హరిబాబు, రైతు,
కొత్తగొల్లపాలెం

డబ్బులు రాలేదు



ఐదెకరాల్లో వరిసాగు చేశాను. 100 బస్తాల ధాన్యం ఈపురుపాలెం బాలాజీ మిల్లుకు తోలాను. డబ్బులు రెండు రోజులకే ఖాతాలో వేస్తామన్నారు. నెల దాటుతున్నా పైసా ఇవ్వలేదు. అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టాం. ఇచ్చినవారు డబ్బులు అడుగుతున్నారు. అధికారులను అడిగితే మాకు తెలియదంటున్నారు. ఎవరి వద్దకు వెళ్లాలో అర్థం కావడంలేదు.

–బత్తుల సుబ్బారావు, రైతు, కొత్తగొల్లపాలెం

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తాం



నాలుగు ఎకరాల్లో వరి సాగు చేశాను. 112 బస్తాల ధాన్యం మిల్లులకు తోలాం. కలెక్టర్, జిల్లా అధికారులు వచ్చి దగ్గరుండి ధాన్యం మిల్లులకు పంపిస్తుంటే డబ్బులు ఇవ్వరని ఎలా అనుకుంటాం. అందుకే నమ్మాం. మోసగిస్తారని అనుకోలేదు. నెల దాటినా పైసా ఇవ్వలేదు. వెంటనే డబ్బులు ఇవ్వాలి. లేకపోతే అందరం కలెక్టర్ ఆఫీసుకు వెళ్లి ధర్నా చేస్తాం.

–ఎల్లవల సురేష్, రైతు,
కొత్త గొల్లపాలెం

ఎన్జీ రంగా అగ్రి వర్సిటీ వజ్రోత్సవాలు ప్రారంభం



వర్సిటీ వజ్రోత్సవ పైలాన్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కె.అచ్చెన్నాయుడు

- వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు
- రెండు రోజులపాటు ఉత్సవాలు

గుంటూరురూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటై 60 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రెండు రోజులపాటు నిర్వహించనున్న వజ్రోత్సవాలను మంగళవారం ప్రారంభించారు. గుంటూరు శివారు లోని లాం ఫాం వ్యవసాయ పరిశోధన స్థానంలోని వర్సిటీలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు వజ్రోత్సవ పైలాన్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఎన్జీరంగా విగ్రహావిష్కరణ చేశారు. విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ వర్సిటీ రైతుల కోసం మరిన్ని వంగడాలను తయారు చేయాలని సూచించారు. ఉపకులపతి డాక్టర్ ఆర్.శారదజయలక్ష్మిదేవి సాంకేతిక సదస్సును ప్రారంభించి విశ్వవిద్యాలయ ప్రగతిని వివరించారు. కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి ప్రొఫెసర్ విజయ్‌పాల్‌శర్మ, రైతు సాధికార సంస్థ వైస్ చైర్మన్ టి.విజయ్‌కుమార్, అగ్రిమిషన్ వైస్ చైర్మన్ మర్రిరెడ్డి శ్రీనివాస్ నూతన వంగడాలు, పరిశోధనలపై చర్చించారు. సాంకేతిక నిపుణులు పలు అంశాలపై ప్రసంగించారు. మాజీ ఉపకులపతి డాక్టర్ పి.రాఘవరెడ్డి మాట్లాడుతూ 1964 నుంచి నేటి వరకూ విశ్వవిద్యాలయం సాధించిన అభివృద్ధి, కృషిని అభినందించారు. వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు, పరిశోధన సంచాలకుడు డాక్టర్ పీవి సత్యనారాయణ, విస్తరణ సంచాలకుడు డాక్టర్ జి. శివన్నారాయణ అతిథులను శాలువాలతో సత్కరించారు. విశ్వవిద్యాలయం 60 ఏళ్ళలో సాధించిన ప్రగతికి నిదర్శనంగా ఏర్పాటు చేసిన 150 పరిశోధన, వంగడాలు, ఇతర స్టాళ్లు రైతులు, సందర్శకులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే బి.రామాంజనేయులు, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వజ్రోత్సవ వేడుకల్లో పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, వ్యవసాయ శాఖ ప్రత్యేక కార్యదర్శి జి.రాజశేఖర్, వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీ రావు, మాజీ చైర్మన్ చింతల గోవిందరాజులు, పి.జె.పి.ఎస్.ఎ.యూ వైస్‌చాన్సలర్ జానయ్య, పశువైద్య విశ్వవిద్యాలయం వీసీ జె.వి.రమణ, డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ కె.గోపాల్, ఏపీ మత్స్య విశ్వవిద్యాలయం స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ టి.సుగుణ, రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ వెంకటేశ్వరరావు, మాజీ వీసీ డాక్టర్ దామోదర్ నాయుడు, రైతులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, పాలక మండలి సభ్యులు, శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

గాయత్రీదేవి శక్తి స్థూపం ఆవిష్కరణ



కర్లపాలెం: గాయత్రీదేవి ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని ఆధ్యాత్మికవేత్త రాజ్యలక్ష్మి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని దమ్మనవారిపాలెం గ్రామంలో పి.వెంకట ప్రసూనాంబ, సునందనరావు దంపతుల ఆధ్వర్యంలో గాయత్రీదేవి స్థూపం ఆవిష్కరించారు. ముందుగా స్థూపం వద్ద శాంతిహోమాలు నిర్వహించారు. అనంతరం గాయత్రీ మహామంత్రం జపించి గాయత్రీదేవికి పూజలు చేశారు. ఆధ్యాత్మికవేత్త రాజ్యలక్ష్మి మాట్లాడుతూ భూమి, ఆకాశం, అగ్ని, జలం, వాయువు మొదలగు పంచ భూతాల సమూహమే గాయత్రీదేవి అని చెప్పారు. విశ్వశాంతి కోసం గాయత్రీదేవిని పూజించాలని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గురప సాల వెంకటేశ్వరమ్మ, మాజీ ఎంపీపీ తాతా లీలావరప్రసాద్, మాజీ సర్పంచ్ అలపర్తి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

కాలువలు ఇలా...నీరు పారేదెలా!



కొల్లూరు స్నానాల రేవు సమీపంలో తూటికాడతో నిండిపోయి ఉన్న దోనేపూడి చానల్

- కాలువల్లో పేరుకుపోయిన తూటికాడ
- పలుచోట్ల కట్టలకు గండ్లు
- నీటి పారుదలకు ఆటంకాలు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- రైతుల్లో ఆందోళన

కొల్లూరు: కొల్లూరు మండలంలో పంట కాలువల పరిస్థితి అస్తవ్యస్తంగా తయారైంది. కొన్ని కాలువల్లో తూటికాడ పెరిగింది...మరికొన్ని కాలువల్లో పూడిక పేరుకుపోయింది...ఇంకొన్ని కాలువల కట్టలకు గండ్లు పడ్డాయి. పంట కాల్వల తీరుతెన్నులు పరిశీలిస్తే ఖరీఫ్ సాగులో నీటి కోసం రైతులకు కష్టాలు తప్పేలా లేదు. కూటమి ప్రభుత్వం పంట కాలువల దుస్థితిపై దృష్టి సారించడం లేదు. కొల్లూరు నీటి పారుదల శాఖ పర్యవేక్షణలో కొల్లూరు మండలంతోపాటు వేమూరు, భట్టిప్రోలు మండలాల్లోని ఆయకట్టుకు సాగు నీరు అందాల్సి ఉంది. ఏడు ప్రధాన కాల్వల ద్వారా నీటి మళ్లింపులు జరుగుతాయి. ఖరీఫ్ సాగుకు నీరు విడుదల చేయడానికి ముందుగానే కాల్వల మరమ్మతులు చేపట్టాల్సి ఉన్నా ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు ఉన్నారు. కొల్లూరు పశ్చిమ బ్యాంకు కెనాల్ నుంచి వరహాపురం చానల్ ద్వారా 7,442 ఎకరాలు, దోనేపూడి కాలువ ద్వారా 5,146, కొల్లూరు సైడ్ చానల్ ద్వారా 2,042, కొల్లూరు బ్రాంచి ద్వారా 567, కొల్లూరు నార్త్ సైడ్ చానల్ ద్వారా 3,019, క్రాప బ్రాంచి ద్వారా 842, చినపులివర్రు కాలువ ద్వారా 702 ఎకరాల ఆయకట్టుకు ఖరీఫ్‌కు నీటి పంపిణీ చేపట్టాల్సి ఉంది. 25,608 ఎకరాల ఆయకట్టుకు సాగు నీటిని చేర్చే కాల్వల కట్టలు బలహీనపడి, తూటి కాడతో కప్పేసి ఉన్నా వాటి బాగోగులు గురించి పట్టించుకొనే వారే కరువయ్యారు. మండలంలోని ఆలపాటి నగరం వద్ద పంట కాలువకు గండి పడి నీరు వృథాగా పోతూ పంటలను ముంచెత్తుతుంది. 5వేల ఎకరాలకు పైగా ఆయకట్టుకు సాగు నీరు చేర్చాల్సిన దోనేపూడి చానల్‌లో తూటి కాడ దట్టంగా పెరిగి పారుదలకు ఆటంకంగా మారి నీరు ఎగతట్టి గట్టు మీదగా ప్రవహిస్తున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. కొల్లూరు స్నానాల రేవు ప్రాంతం నుంచి దళితవాడ చివరి వరకు దోనేపూడి చానల్ వ్యర్థాలతో పూడిపోవడంతోపాటు, చెట్లు పెరిగి నీటి పారుదలకు తీవ్ర అటంకంగా తయారైంది. కాలువ మరమ్మతుల పనులు చేపట్టకపోవడంతో స్థానికంగా ప్రజలు దుర్గంధం భరించలేక ఇబ్బందులు పడుతున్నారు.

పూడికతీతలో ప్రమాణాలకు చెల్లు చీటి

ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపడుతున్న పంట కాల్వల పూడికతీత పనుల్లో ప్రమాణాలు పాటించడం లేదు. ప్రతి ఏటా పూడిక తీసిన కాల్వల్లోనే తిరిగి పూడిక తీయడం మినహా ప్రధాన కాల్వల గురించి పట్టించుకోవడం లేదు. పంట కాల్వల్లో తీసిన మట్టితో కట్టలు పటిష్టం చేయాల్సింది పోయి ఆ మట్టిని తీసిన చోటే పోయడం వల్ల తిరిగి కాల్వల్లోకి జారి యథాస్థితికి చేరుతున్నాయి. ఉపాధి కార్మికులకు నిర్ణయించే కొలతల విషయంలోనూ నీటి పారుదల శాఖకు సంబంధం లేకుండా ఎన్ఆర్‌జీఎస్ సిబ్బందే నిర్ణయిస్తుండటంతో సమస్యలు తలెత్తుతున్నాయి. ఇరు శాఖల మధ్య సమన్వయ లోపం కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారు.



చినపులివర్రు వద్ద ఆనవాలు కూడా లేని పంట కాలువ

ఈ చిత్రాన్ని పరిశీలించిన వారు రోడ్డు మార్జిన్‌లో కంప పెరిగిందని భావిస్తారు. కానీ అది పంట కాలువ. దాదాపు 702 ఎకరాలకు సాగునీరు అందించే పంట కాలువ. కానీ పూడికతీత లేక కంప పెరిగి పంట కాలువ తన రూపాన్నే కోల్పోయింది. ఈ కాలువ కింద సాగు చేసే భూములకు సాగు నీరు అందడం ప్రశ్నార్థకమే. అయినా ప్రభుత్వం కానీ, అధికారులు కానీ పట్టించుకున్న దాఖలాలు లేవు. ఖరీఫ్‌లో పంట సాగు ఎలా చేయాలి, చేస్తే సాగు అందుతుందా లేదా అనే మీమాంసలో రైతులు ఉన్నారు.



కొల్లూరు ఎల్ఈ స్కూల్ ప్రాంతంలో మురుగుతో నిండిన ప్రధాన పంట కాలువ



ఆలపాటి నగరం వద్ద కట్టలు తెగిపోవడంతో తాత్కాలికంగా వేసిన ఇసుక బస్తాలు

అనుమతులు మంజూరైతే మరమ్మతులు

పంట కాలువల మరమ్మతులకు ప్రస్తుతానికి అనుమతులు మంజూరు కాలేదు. కాలువల మరమ్మతుల కోసం అంచనాలు తయారుచేసి ఉన్నతాధికారులకు సమర్పించాం. అనుమతులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభించి కాలువలను మరమ్మతులు చేస్తాం.

–సాంబశివరావు,
ఇరిగేషన్ ఏఈ, కొల్లూరు

ఇక నుంచి పొగాకు బోర్డులోకి బ్లాక్ బర్లీ

లక్ష్మీపురం: రాష్ట్రవ్యాప్తంగా బ్లాక్ బర్లీ పొగాకును రైతు సంఘాలు, రైతుల పోరాట ఫలితంగా పొగాకు బోర్డులోకి చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిందని రైతు సంఘ నాయకులు చెబుతున్నారు. రెండు సంవత్సరాల వరకు బ్లాక్ బర్లీ పొగాకు సుమారు రూ.20 వేలు రూ.21వేల వరకు క్వింటా ధర పలికింది. ఈ ఏడాది రూ.2వేలు, రూ.3వేలు అని అంటున్నా.. కొనుగోలుకు ఎవరు ముందుకు రావడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా బ్లాక్ బర్లీ పొగాకు దాదాపు 3 లక్షల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ప్రధానంగా గుంటూరు జిల్లాలో 10వేల ఎకరాల్లో వేశారని రైతు సంఘ నాయకులు చెబుతున్నారు. అయితే గతంలో బ్లాక్ బర్లీ పొగాకు బోర్డులో ఉండేది కాదు. గత కొంత కాలంగా రైతు సంఘ నాయకులు, రైతులు, రైతు కార్మికులు చేస్తున్న పోరాటాలు, విజ్ఞప్తులను రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించి బ్లాక్ బర్లీ పొగాకును పొగాకు బోర్డు పరిధిలోకి తీసుకు వచ్చింది. రైతు సంఘ నాయకుడు కంచుమాటి అజయ్ హర్షం వ్యక్తం చేశారు.

మిర్చి యార్డు సమాచారం
(మంగళవారం ధరలు)



వచ్చిన బస్తాలు	1,27,525
అమ్మకాలు	1,24,819
నిల్వ	52,500

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-13,200
నంబరు-5	10,000-12,500
273	10,000-12,400
341	10,000-13,200
4884	10,000-11,200
సూపర్-10	10,000-12,400
తాలుకాయలు	4,500-6,500

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 13,600
షార్క్-1	10,000 - 12,100
బాడిగ-355	10,000 - 13,000
దేవనూరు డీలక్స్	10,000 - 12,600
ఆర్మూర్	9,800 - 11,200
తాలు	4,500 - 6,500

-కొరిటిపాడు (గుంటూరు)

క్లుప్తంగా

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ సమస్యలు పరిష్కరించాలి



బాపట్ల వైద్య ఆరోగ్యశాఖలో సీహెచ్‌ఓలుగా పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అసోసియేషన్ నాయకులు వీర ప్రతాప్ పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయం వద్ద మంగళవారం నిరవధిక సమ్మె కార్యక్రమం చేపట్టారు. వీరప్రతాప్ మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎంలో సీహెచ్‌ఓగా పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవటంలేదని అన్నారు. ఆరుసంవత్సరాలు నిండిన సీహెచ్‌ఓలను క్రమబద్ధీకరించాలని, 23శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలని, ప్రతి నెలా శాలరీతోపాటు ఇన్సెంటివ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమ్మెలో నాయకులు త్రినయని, ఎస్ఎస్‌రాజు, రాజా, కృపానిధి, రత్నకుమారి పాల్గొన్నారు.

రేపటి నుంచి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు

బల్లికురవ మండలంలోని వీ.కొప్పరపాడు గ్రామంలోజిల్లా స్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలు గురువారం నుంచి నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కమిటీ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. విజేతలకు మొదటి బహుమతిగా రూ.20,1116, రెండో బహుమతిగా రూ.15,116, మూడో బహుమతిగా రూ.10,116, నాల్గవ బహుమతిగా రూ.5,116, మ్యాన్ ఆఫ్ ది సిరిస్ బెస్ట్ బ్యాట్స్‌మెన్, బెస్టు బౌలర్‌కు బహుమతులు అందజేస్తున్నామని మరిన్ని వివరాలకు బలరాం 7036938516 నంబర్‌ను సంప్రదించవచ్చన్నారు.

వైభవంగా నూతలపాడు పోలేరమ్మ తిరునాళ్ల

పర్చూరు(చినగంజాం): మండలంలోని నూతలపాడు గ్రామంలో పోలేరమ్మ అమ్మవారి 55వ తిరునాళ్ల మహోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పంట చేతికి అందిన తరువాత గ్రామంలో తిరునాళ్ల నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తుంది. తిరునాళ్లను పురస్కరించుకొని వేలాదిగా భక్తులు తరలివచ్చి పోలేరమ్మ అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. తిరునాళ్ల సందర్భంగా నిర్వహించిన జాతర కార్యక్రమంలో శిడిమాను ఉత్సవం, శిడి పెళ్లి కొడుకు కార్యక్రమం విశేషతను సంతరించుకొంది. మేకపోతును పూజించి అమ్మవారిని ఆవహింపజేసిన మేకపోతును ఊయల పెట్టెలో ఉంచి శిడిమానుకు వేలాడ తీయడం సంప్రదాయంగా వస్తుంది. శిడిమానుకు రైతులు పండించిన వరి, మిరప, మొక్కజొన్న కుంకులను వేలాడదీసి తమ భక్తిని చాటుకున్నారు. అనంతరం శిడిమానుని అమ్మవారి ఆలయం చుట్టూ మూడుసార్లు ప్రదక్షిణలు చేసి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించి యువకుల కేరింతల నడుమ గ్రామోత్సవ కార్యక్రమాన్ని పూర్తి చేశారు. శిడిమాను బండిని లాగితే కష్టాలు తొలగిపోతాయనే విశ్వాసంతో భక్తులు, యువకులు, చిన్నారులు, మహిళలు సైతం ఎంతో ఉత్సాహంగా గ్రామోత్సవంలో పాల్గొన్నారు. యువకులు చేసిన కేరింతలు, నృత్యాలు ప్రేక్షకులను అమితంగా ఆకర్షించాయి. తిరుణాళ్ల సందర్భంగా మజ్జిగ, పులిహోర, అన్నదాన కార్యక్రమాలను దాతలు ఏర్పాటు చేశారు. తిరునాళ్లలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు ప్రత్యేకంగా బందోబస్తు ఏర్పాట్లు చేశారు. డీఎస్పీ పర్యవేక్షణలో పర్చూరు ఇన్‌చార్జ్ సీఐ శేషగిరిరావు, ముగ్గురు ఎస్ఐలు, 50 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.



శిడిమాను గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు

చలివేంద్రం ఏర్పాటుచేసిన రోటరీ క్లబ్

నూతలపాడు పోలేరమ్మ ఆలయం వద్ద తిరునాళ్లను పురస్కరించుకొని భక్తుల కోసం ప్రతి సంవత్సరం మాదిరిగానే పర్చూరు రోటరీ క్లబ్ సెంట్రల్, సపోర్ట్ సహకారంతో భక్తులకు వేసవిలో ఇబ్బంది కలుగకుండా మంచినీటి చలివేంద్రాన్ని గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త విన్నకోట రవికుమార్ ప్రారంభించారు. పోలూరి శివారెడ్డి, గ్రామస్తులు పాల్గొనగా రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు తోకల కృష్ణమోహన్, కోమటి ఆంజనేయులు, సపోర్ట్ అధ్యక్ష, కార్యదర్శులు నాగబైరు శ్రీనివాసరావు, పంబి సదానందరెడ్డి, సభ్యులు భవనం రాజగోపాల్‌రెడ్డి, పాల్గన్నారు, భక్తులకు విన్నకోట రవి మంచినీటిని అందజేశారు.



శిడిమాను గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు

నాటికలకు ప్రేక్షకుల ఆదరణ అపూర్వం

- సినీ నటి శివపార్వతి
- మూడో రోజు రసవత్తరంగా నాటక ప్రదర్శనలు



కళాకారులకు పారితోషికాలు, బహుమతులు అందజేస్తున్న సినీ నటి శివపార్వతి

భట్టిప్రోలు (కొల్లూరు): నాటక రంగం మరుగునపడుతుందన్న ఆందోళనతో గడుపుతున్న ప్రస్తుత తరుణంలో నాటకాలు, నాటికల వీక్షణకు ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టడం అపూర్వమని సినీ నటి శివపార్వతి అన్నారు. భట్టిప్రోలు మండలం పల్లెకోనలో పరుచూరి రఘుబాబు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రఘుబాబు స్మారక 35వ జాతీయ స్థాయి ఆహ్వాన నాటిక, నాటికల పోటీలు మూడు రోజైన మంగళవారం కూడా కొనసాగాయి. ఆమె మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో కళారంగానికి పూర్వ వైభవం తీసుకురావడానికి ప్రతి ఒక్కరూ నడుం కట్టాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. గతంలో ఊరూర నాటక సమాజాలు ఉండటంతోపాటు నిరంతరం నాటక, నాటికల ప్రదర్శనలతో ప్రజలకు ఆహ్లాదాన్ని పంచడంలో కళాకారులు నటనకు ప్రాధాన్యం ఇచ్చి ప్రాణప్రదంగా పాత్రల్లో ఇమిడిపోయి నటించేవారన్నారు. నాటక, నాటికల ప్రదర్శనలు, స్టేజ్ ప్రదర్శనల్లో నటించే నటులు నటనపరంగా ఎటువంటి లోటుపాట్లు లేకుండా నటించేందుకు అధిక ప్రాధాన్యత ఇచ్చేవారన్నారు. మూడోరోజు ప్రదర్శనలలో భాగంగా మంగళవారం రాత్రి హైద్రాబాద్ ప్రగతినగర్‌కు చెందిన కళాంజలి వారు నటించిన అన్నదాత నాటకం ప్రేక్షకులను కట్టిపడేసింది. పెదకాకానికి చెందిన గంగోత్రి వారు నటించిన పేగు రాసిన శాసనం, విజయవాడకు చెందిన గురజాడ కళామందిర్ వారు ప్రదర్శించిన మహా ప్రస్థానం నాటికలు సైతం ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఒక ప్రదర్శనకు మించి మరో ప్రదర్శన ఉంటుండటంతో ప్రేక్షకులు అర్ధరాత్రి వరకు జరుగుతున్నప్పటికీ ప్రేక్షకులు ప్రదర్శనలు ఆసాంతం వీక్షిస్తూ అనుభూతికి లోనవుతున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు, సినీ రచయత పరుచూరి వెంకటేశ్వరరావు, సినీ మాటల రచయత బుర్రా సాయిమాధవ్‌లు పాల్గొన్నారు.

భర్తపై భార్య యాసిడ్ దాడి

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు

పెదకాకాని: భర్తపై భార్య యాసిడ్‌తో దాడి చేసిన సంఘటన పెదకాకానిలో చోటుచేసుకుంది. విశాఖపట్నం గాజువాకకు చెందిన గండికోట బాలకృష్ణ సొంతగా లారీలు బాడుగకు తిప్పుకుంటున్నాడు. అతనికి గుంటూరుకు చెందిన రమణమ్మతో రెండు నెలల కిందట అడిగొప్పలలో వివాహమైంది. అప్పటికే రమణమ్మకు మూడు పెళ్లిళ్లు అయ్యాయి. ఈనెల 26వ తేదీన వట్టిచెరుకూరు మండలం కుర్నూతల ఉన్న బాలకృష్ణ సోదరి ఇంట్లో శుభకార్యం జరిగింది. ఈ శుభకార్యానికి వెళ్లడానికి వీలులేదంటూ భార్య రమణమ్మ అడ్డు తగలడంతో వెళ్లకుండానే ఆగిపోయారు. ఈ నేపథ్యంలో ఇరువురి మధ్య వాగ్వివాదం జరిగింది. సోమవారం రాత్రి బాలకృష్ణ గుంటూరు నుంచి మంగళగిరి మండలం కాజ గ్రామంలో ఉన్న స్నేహితుడిని కలిసేందుకు బైక్‌పై బయలు దేరాడు. మార్గమధ్యంలో పెదకాకాని శివారులో జాతీయ రహదారి పక్కనే ఉన్న పల్లాలమ్మ చెరువు వద్దకు మరొక వ్యక్తి సహకారంతో కారులో భార్య రమణమ్మ చేరుకుంది. రోడ్డుపై వెళుతున్న భర్త బైక్‌ను ఆపి వెంట తెచ్చుకున్న యాసిడ్‌ను ముఖంపై పోసి అక్కడి నుంచి వెళ్లిపోయింది. ఈ దాడిలో గాయపడిన బాలకృష్ణను స్థానికులు 108 వాహనంలో గుంటూరు తరలించారు. బాధితుని ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ టీపీ నారాయణస్వామి తెలిపారు.

ఎన్‌ఆర్‌జీఎస్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ అధికారి సస్పెన్షన్

వేమూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అసిస్టెంట్ ప్రాజెక్ట్ అధికారి సత్యకృష్ణను తాత్కాలికంగా సస్పెండ్ చేసినట్లు ఎంపీడీవో శివన్నారాయణ మంగళ వారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగరం మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి పథకం నిధుల్లో అవినీతికి పాల్పడినట్లు సోషల్ ఆడిట్‌లో వెలుగులోని రావడం జరిగింది. దీంతో సోషల్ ఆడిట్ సిఫార్సు మేరకు తాత్కాలికంగా సస్పెండ్ చేశారు. తరువాత విచారణ చేయడం జరుగుతుందన్నారు. గతంలో కూడా అవినీతి వల్ల సస్పెండ్ చేశారు. గత ప్రభుత్వంలో మరల ఉద్యోగం పొందడం జరిగింది. మరల సస్పెండ్ చేసినట్లు ఆయన తెలిపారు.

పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

చీరాల: పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం చీరాలలో చోటుచేసుకుంది. ఒన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... ఇంకొల్లుకు చెందిన శివాజి (35) మంగళవారం చీరాలలోని ఓ లాడ్జి సమీపంలో పురుగుమందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతిచెందాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ మేరకు ఒన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

'నెత్తుటి సంతకం' నాటకానికి ప్రథమ బహుమతి

తెనాలి: కొలంకపురి నాటక కళాపరిషత్, శ్రీసాయి ఆర్ట్స్, కొలకలూరు సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ద్వితీయ సాంఘిక నాటక, నాటిక రచనల పోటీల ఫలితాలను కార్యదర్శి గోపరాజు విజయ్ మంగళవారం ప్రకటించారు. నాటకం విభాగంలో చిలకలూరిపేటకు చెందిన నాటకరంగ పరిశోధకుడు డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు రచన 'నెత్తుటి సంతకం' నాటకం ప్రథమ ఉత్తమ రచనగా ఎంపికైంది. ఆరిశెట్టి శివన్నారాయణ జ్ఞాపకార్థం బహూకరించే రూ.20 వేల నగదును గెలుచుకుంది. విశాఖపట్నం నాటక రచయిత పీటీ మాధవ్ రచన 'తెల్ల కోటు తెల్లబోయింది' నాటకం ద్వితీయ ఉత్తమ రచనగా ఎంపికైంది. పరాంకుశం భవానిప్రసాద్ జ్ఞాపకార్థం రూ.15 వేల బహుమతిని గెలిచింది.

సాంఘిక నాటికల విభాగంలో...

సాంఘిక నాటికల విభాగంలో హైదరాబాద్ రచయిత సింహప్రసాద్ రచన 'వంటింటికి నిప్పుపెట్టండి' నాటిక ప్రథమంగా ఎంపికై భారతుల రామకృష్ణ జ్ఞాపకార్థం బహూకరించే రూ.15 వేల బహుమతిని గెలుచుకుంది. విజయవాడ రచయిత సుఖమంచి కోటేశ్వరరావు రాసిన 'మమ్మల్నీ బ్రతకనివ్వండి' నాటిక ద్వితీయ ఉత్తమ రచనగా ఎంపికై, గంధం నాగరాజు జ్ఞాపకార్థం అందజేస్తే రూ.10 వేల బహుమతిని అందుకోనుంది. న్యాయనిర్ణేతలుగా జి. రమణ, బి.సుబ్బారావు వ్యవహరించారు.

ముగిసిన మహా మంజీరనాదం

నగరంపాలెం: గత వారం రోజులుగా బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం అన్నమయ్య కళావేదికపై శ్రీసాయి మంజీర కూచిపూడి ఆర్ట్ అకాడమీ నిర్వహిస్తున్న 15వ అంతర్జాతీయ నృత్య దినోత్సవాలు (మహా మంజీర నాదం -2025) మంగళవారంతో ముగిశాయి.

న్యాయమూర్తుల పరిచయ కార్యక్రమం



మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి సాయి కళ్యాణ్ చక్రవర్తి

గుంటూరులీగల్: గుంటూరు జిల్లా కోర్టులో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి సాయి కళ్యాణ్ చక్రవర్తి, ఇండస్ట్రియల్ ట్రిబ్యునల్ అండ్ లేబర్ న్యాయమూర్తి బి.రాములు, చైల్డ్ ఫ్రెండ్లీ కోర్ట్ (పోక్సో కోర్టు) న్యాయమూర్తి షమీ పర్వీన్ సుల్తానా బేగంల పరిచయ కార్యక్రమం జిల్లా కోర్టు ప్రాంగణంలో మంగళవారం జరిగింది. కార్యక్రమంలో అన్ని కోర్టుల న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు. ప్రధాన న్యాయమూర్తి న్యాయవాదులను ఉద్దేశించి మాట్లాడారు. జిల్లా కోర్టులోని వాహనాల పార్కింగ్ వసతులు సక్రమంగా ఉండేలా చర్యలు చేపడతామన్నారు. జిల్లా కోర్టులోని అన్ని కోర్టులకు కావలసిన వసతులను సమకూర్చి, కోర్టులో పరిశుభ్రతకు పెద్దపీట వేస్తామని హామీ ఇచ్చారు. జిల్లాలో ఉన్న అన్ని కోర్టులకు కావలసిన వసతులను సమకూర్చేందుకు చర్యలు చేపడతామన్నారు. జిల్లా కోర్టులో మహిళా న్యాయవాదులకు బార్ అసోసియేషన్‌లో కావలసిన సౌకర్యాలు సమకూర్చేందుకు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. జిల్లా ప్రధానన్యాయమూర్తి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని పురాణం కల్యాణ లేడీ రిప్రజెంటివ్ బార్ అసోసియేషన్‌కు 30 కుర్చీలు అందజేశారు. బార్ కౌన్సిల్ సభ్యుడు వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి 50 కుర్చీలకు కావలసిన నగదు చెక్కును ప్రధాన న్యాయమూర్తి సమక్షంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యంగళ శెట్టి శివ సూర్యనారాయణకు అందజేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శివసూర్యనారాయణ మాట్లాడుతూ బార్ అండ్ బెంచ్ రిలేషన్‌కు కావలసిన సహాయ సహకారాలు అందించటానికి న్యాయవాదులు తరపున హామీ ఇచ్చారు.

ప్రధాని సభకు అన్నిఏర్పాట్లు పూర్తి

రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్థన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జనార్థన్‌రెడ్డి

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్): రాజధాని ప్రాంతంలో ప్రధాన మంత్రి నరేంద్ర రానున్న సభకు జిల్లా నుంచి తరలివచ్చే ప్రజానీకానికి ఇబ్బంది లేకుండా అవసరమైన ఏర్పాట్లు చేపట్టినట్టు రాష్ట్ర రోడ్లు, భవనాలు, మౌలిక వసతులు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం గుంటూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్‌లో కమిషనరు పులి శ్రీనివాసులు, నగర మేయరు కోవెలమూడి రవీంద్ర, ఎమ్మెల్యేలు నజీర్ అహ్మద్, గళ్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, తెనాలి శ్రావణ్ కుమార్, అమర్నాథ్ రెడ్డి, ఏలూరు సాంబశివరావు, రాష్ట్ర ఏపీఎంఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్, రాష్ట్ర లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యాలరావుతో కలసి మే 2వ తేదీన రాజధాని ప్రాంతంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పాల్గొనే సభకు జిల్లా నుంచి తరలివచ్చే ప్రజలకు చేపట్టాల్సిన ఏర్పాట్లుపై వివిధ శాఖల అధికారులు, కార్పొరేటర్లు, కూటమి నాయకులతో సమన్వయ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాజధాని సమీపంలో ఉన్న జిల్లా నుంచే అత్యధికంగా ప్రధాన మంత్రి సభకు ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. రవాణా వాహనాలు సమకూర్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సభకు నిర్దేశించిన సమయానికి బస్సులు బయలుదేరేలా, సకాలంలో వారికి భోజనాలు, మంచినీరు, మజ్జిగా అందించేలా పూర్తి స్థాయిలో కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ సభకు గుంటూరు పార్లమెంట్ నుంచే దాదాపు 2.25 లక్షల మంది ప్రజలు వస్తారని అంచనా వేస్తున్నామని, ముఖ్యంగా రాజధాని సమీపంలోని గుంటూరు ఈస్ట్, గుంటూరు వెస్ట్, ప్రత్తిపాడు నియోజకవర్గాల నుంచి దాదాపు 90 వేల మంది ప్రజలు రానున్నారన్నారు. డిప్యూటీ మేయర్ సజీలా, అదనపు కమిషనర్ ఓబులేసు, అడిషనల్ ఎస్పీ రమణమూర్తి, డీటీసీ సీతారామిరెడ్డి, ఆర్టీసీ ఆర్ఎం కృష్ణ కాంత్, డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి, మెప్మా పీడీ విజయలక్ష్మి, కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని మద్యంలో ముంచెత్తుతున్న సీఎం చంద్రబాబు

- అనుమతులు లేని పర్మిట్ రూమ్‌లు ఎలా కొనసాగుతున్నాయి
- వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు



భట్టిప్రోలులో మద్యం దుకాణంలో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన పర్మిట్ రూమ్‌ను పరిశీలిస్తున్న అశోక్‌బాబు

భట్టిప్రోలు (కొల్లూరు): రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయకుండా కాలం గడుతుపున్న సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని మాత్రం మద్యంలో ముంచెత్తుతున్నారని వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు విమర్శించారు. సోమవారం రాత్రి ఆయన భట్టిప్రోలులోని రెండు మద్యం దుకాణాలలో అనధికారికంగా నడుపుతున్న పర్మిట్ రూమ్‌లను పరిశీలించి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మద్యం దుకాణాలలో పర్మిట్ రూమ్‌లకు అనుమతులు ఇవ్వకపోయినప్పటికీ బహిరంగంగా పెద్దఎత్తున పర్మిట్ రూమ్‌లు ఏర్పాటు చేసి మద్యం అమ్మకాలు జరుపుతుంటే ప్రభుత్వం, ఎక్సైజ్, పోలీసు శాఖలు ఏమి చేస్తున్నాయని ప్రశ్నించారు. మద్యం దుకాణాలలో ఏర్పాటు చేసిన పర్మిట్ రూమ్‌ల అడ్డాగానే పేకాట, ఇతర అశ్లీల కార్యక్రమాలు పెద్దఎత్తున జరుగుతున్నాయని అన్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి మద్యం అక్రమాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. మద్యం దుకాణాలలో జరుగుతున్న అక్రమాలపై సంబంధిత శాఖలు స్పందించని పక్షంలో వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలసి పోరాటం చేసి వాటిని రోడ్డుకు ఈడుస్తామన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని ఆయన హెచ్చరించారు.

మార్షల్ ఆర్ట్స్‌లో బాపట్ల క్రీడాకారులకు బంగారు పతకాలు



బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న కోచ్ కె.దివ్యతేజ

బాపట్ల: కుడో కాంబాబు మార్షల్ ఆర్ట్స్‌లో బాపట్ల జిల్లాకు చెందిన క్రీడాకారులు బంగారు పతకాలు సాధించినట్లు కోచ్ కె.దివ్యతేజ పేర్కొన్నారు. మంగళవారం క్రీడాకారుల సన్మాన కార్యక్రమం అకాడమీలో జరిగింది. కోచ్ దివ్యతేజ మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షులు ఆలూరి శశిధర్ ఆధ్వర్యాన ఈనెల 27వ తేదీన అనకాపల్లి జిల్లా పరవాడలో ఒకటో రాష్ట్ర స్థాయి పోటీలు జరిగాయని తెలిపారు. మార్షల్ ఆర్ట్స్‌లో 80 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. బాపట్ల జిల్లా తరపున 11 సంవత్సరాల బాలుర విభాగంలో కె.శ్రీ షణ్ముఖ, 12 సంవత్సరాల బాలుర విభాగంలో శ్రీకృష్ణ బంగారు పతకాలు సాధించారని తెలిపారు. మే నెలలో జరిగే అంతర్జాతీయ పోటీలు పూణెలో జరుగుతాయని వీటిలో పాల్గొనేందుకు అర్హత సాధించారని తెలిపారు. సభలో ఆంధ్రప్రదేశ్ కుడో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ అడే కిరణ్‌కిషోర్, జనరల్ సెక్రెటరీ బి.రవిబాబు, ట్రెజరర్ ఎ.అనురాధ తదితరులు పాల్గొన్నారు.

సముద్ర తాబేళ్ల రక్షణలో అటవీ శాఖ

జిల్లా అటవీ శాఖ అధికారి ఎల్ భీమయ్య



సముద్రంలోకి విడుదల చేస్తున్న తాబేలు పిల్లలు

వేటపాలెం: అలీవ్ రెడ్లీ సముద్ర తాబేళ్ల సంరక్షణే అటవీ శాఖ ధ్యేయమని జిల్లా అటవీ శాఖ అధికారి ఎల్ భీమయ్య పేర్కొన్నారు. మంగళవారం వేటపాలెం మండలం రామాపురం సముద్రతీర ప్రాంతంలోని తాబేళ్ల సంరక్షణ కేంద్ర నుంచి జిల్లా అటవీ శాఖ అధికారి చేతుల మీదుగా 45 ఆలీవ్ రెడ్లీ తాబేళ్ల పిల్లలను సురక్షితంగా సముద్రంలోకి విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ లివ్ రెడ్లీ తాబేళ్లు అతరించేదశలోఉండగా అటవీ శాఖ సంరక్షించే కార్యక్రమం 2017 నుండి చేపట్టిందని అన్నారు. ఈ ఏడాది బాపట్ల జిల్లా 6 సముద్ర సంరక్షణ కేంద్రాల నుంచి 17,000 వేల గుడ్లు సేకరించి ఇప్పటికి 15000 వేలు పిల్లలను సురక్షితంగా సముద్రంలోనికి విడుదల చేశామన్నారు. తాబేళ్ల సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన సముద్ర రక్షణ దళ సభ్యులకు మత్స్యకారులు సహకరించాలని వాటికి భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా సమన్వయకర్త శవనం చంద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ఆటవీ శాఖ ట్రీ ఫౌండేషన్ ఐటీసీ బంగారు భవిష్యత్తు ద్వారా రామాపురంలో ఏర్పాటు చేసిన సముద్ర తాబేళ్ల సంరక్షణ కేంద్రం నుంచి ఇప్పటి వరకు 1500 పిల్లలు సురక్షితంగా వదిలామని తెలిపారు. ఇంకా 350 పిల్లలు వదలాల్సి ఉందని తెలిపారు. ఋల్లీ ఆలీవ్ రెడ్లీ తాబేళ్ల పిల్లలను సురక్షితంగా సముద్రంలోనికి వదిలామని తెలిపారు. జీవ వైవిధ్యం పరిరక్షణలో సముద్ర తాబేళ్ల సంరక్షణ ప్రధానమన్నారు. కార్యక్రమంలో రక్షణ దళ సభ్యులు సున్నపు లక్ష్మయ్య, నాగరాజు పాల్గొన్నారు.

వైద్యులకు మానవత్వం అవసరమన్న 'చిగురుమేఘం'



చిగురు మేఘం నాటికలోని ఓ సన్నివేశం



కర్ణుడి ఏకపాత్రాభినయంలో బత్తుల బ్రహ్మారెడ్డి

అలరిస్తున్న కళాంజలి నాటకోత్సవాలు

చీరాల అర్బన్: కార్పొరేట్ హాస్పిటల్స్ పేరుతో వైద్యం వ్యాపారంగా మారిన నేపథ్యంలో వైద్యులకు మానవత్వం అవసరమన్న సందేశంతో సాగిన 'చిగురుమేఘం' నాటిక ప్రేక్షకులను ఆలోచింప జేసింది. చీరాల కళాంజలి ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ గరల్స్ హైస్కూల్‌లో జాతీయ నాటకోత్సవాలను నిర్వహిస్తున్నారు. మంగళవారం అమరావతి ఆర్ట్స్ గుంటూరు వారి చిగురు మేఘం నాటికను ప్రదర్శించారు. నటీనటులు నాటికలోని పాత్రలకు జీవం పోశారు. అనంతరం జనరల్ బోగీలు అనే నాటికను ప్రదర్శించారు. రైళ్లలో సాధారణ బోగీలలో ప్రయాణికుల అవస్థలను అద్దంపట్టేలా నాటిక సాగింది. ఏసీ, స్లీపర్ క్లాసులకు ఇచ్చిన ప్రాధాన్యత సాధారణ బోగీలకు ఇవ్వకపోవడంపై నాటిక సాగింది. అలానే రిటైర్డు ప్రిన్సిపాల్ బత్తుల బ్రహ్మారెడ్డి కర్ణుడి ఏకపాత్రాభియనం ఆహుతులను ఆకట్టుకుంది. అలానే నార్నె నాగేశ్వరరావు రావణ బ్రహ్మ ఏకపాత్రాభినయం ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. ఈనెల 30వ తేదీ వరకు నాటకోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

విద్యార్థి మృతిపై సమగ్ర విచారణ జరిపించాలి

ఎస్ఎఫ్ఐ గుంటూరు జిల్లా కమిటీ డిమాండ్



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్, పక్కన విద్యార్థి సంఘ నాయకులు

లక్ష్మీపురం: అమరావతిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో బీటెక్ సెకండియర్ చదువుతున్న సుభాష్ అనే విద్యార్థి మృతిపై అనేక అనుమానాలు ఉన్నాయని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ తెలిపారు. స్థానిక బ్రాడీపేట ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుకోవాల్సిన విశ్వవిద్యాలయాల్లో వరసగా విద్యార్థులు మృతి చెందుతున్నా రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. విద్యార్థి మృతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలన్నారు. విద్యార్థుల మృతుల ఘటనలపై కమిటీ చేసి విచారణ చేయాలని ఆయన కోరారు. విద్యార్థులు వరుసగా మరణిస్తున్నా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఏమాత్రం స్పందించడం లేదన్నారు. విద్యార్థులకు వచ్చిన మార్కులను మాత్రం ప్రభుత్వం తాము సాధించిన ఘనతగా ప్రచారం చేసుకుంటూ విద్యార్థులు మరణాలకి వారి తమకేమాత్రం సంబంధం లేనట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి నారా లోకేష్ వెంటనే స్పందించి ప్రైవేటు యూనివర్సిటీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు షేక్ సమీర్, నగర కార్యదర్శి ఎ.యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి..

లక్ష్మీపురం: రాజధాని అమరావతిలో వున్న ఎస్ఆర్ఎం యూనివర్సిటీ విద్యార్థి మృతికి కారణమైన యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, సమగ్ర దర్యాప్తు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ డిమాండ్ చేస్తుందని జిల్లా కార్యదర్శి వై.నేతాజీ తెలిపారు. బ్రాడిపేటలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ రాజధాని ప్రాంతంలో వున్న ఎస్ఆర్ఎం వర్సిటీలో యాజమాన్యం వేధింపుల కారణంగా విద్యార్థి మృతిచెందాడని తల్లిదండ్రులు ఆరోపిస్తున్న నేపథ్యంలో దీనిపై సమగ్ర దర్యాప్తు చేయాలని కోరారు. కనీసం చనిపోయిన విషయం తల్లితండ్రులకు సకాలంలో సమాచారం ఇవ్వకపోవడం యాజమాన్యం నిర్లక్ష్యాన్ని తెలియజేస్తుందన్నారు. రాజధాని ప్రాంతంలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ప్రైవేటు యూనివర్సిటీల్లో ఇటీవల కాలంలో విద్యార్థులు మృతి చెందిన పరిస్థితి ఉందని గుర్తు చేశారు. ఆ సందర్భంలో కూడా ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు చేయకపోవడం వల్ల ఇటువంటివి పునరావృతం అవుతున్నాయన్నారు. సంఘంటనలపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ కమిటీని వేసి సమగ్రంగా దర్యాప్తు చేయాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు.